## క్లుప్తంగా

### భక్తుల కొంగు బంగారం ఎల్లమ్మతల్లి



వ్రతాలు చేస్తున్న భక్తులు

**తుక్కుగూడ:** రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు కొంగు బంగారంగా మారింది. అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో ప్రత్యేక అలంకరణ చేసి, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అనంతరం సామూహిక సత్యానారాయణ వ్రతాలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, పూజారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### దర్గా మెట్లకు మ్యాట్ అందజేత



దర్గా మెట్లపై కొత్తగా వేసిన మ్యాట్

**పహాడీషరీఫ్:** పహాడీషరీఫ్‌లోని బాబా షర్ఫుద్దీన్ దర్గా ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి మెట్లకు మ్యాట్‌ను బహూకరించారు. ఎండలు మండి పోతుండడంతో మెట్లపై నడుచుకుంటూ పైకి ఎక్కే భక్తులకు అసౌకర్యం కలుగుతుందన్న విషయాన్ని స్థానిక 14వ వార్డు కౌన్సిలర్ హమీదా దస్తగిర్ దర్గా కమిటీ సభ్యులతో కలిసి ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సొంతంగా నిధులు రూ.2.60 లక్షలు వెచ్చించి మ్యాట్‌ను అందజేశారు. మంగళవారం మ్యాట్‌ను మెట్లపై పరిచిన నిర్వాహకులు ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు.

### కాంగ్రెస్‌లో చేరిన రవీంద్రాచారి



రవీంద్రాచారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణారెడ్డి

**మీర్‌పేట:** మీర్‌పేటకు చెందిన మహేశ్వరం నియోజకవర్గం ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ వర్జోజు రవీంద్రాచారి మంగళవారం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి రవీంద్రాచారితో పాటు నరసింహులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతాని ముఖ్యనాయకులు, కార్యకర్తలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మీర్‌పేట మాజీ సర్పంచ్ పాండుగౌడ్, కోఆప్షన్ సభ్యుడు రవినాయక్, గండికోట అంజయ్యలు పాల్గొన్నారు.

### చిన్నారెడ్డిని కలిసిన జానకీరామ్



చిన్నారెడ్డికి సన్మానం చేస్తున్న జానకీరామ్

**తుక్కుగూడ:** రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జి.చిన్నారెడ్డిని మంగళవారం నగరంలోని ఆయన నివాసం పీసీసీ కార్యదర్శి గోగికర్ జానకీరామ్ కలిశారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపి, సన్మానం చేశారు.

### వినికిడి లోపం ఉన్న పిల్లలకు ఉచిత ఆపరేషన్లు

**చైతన్యపురి:** పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్న పిల్లలకు ప్రభుత్వం చైతన్యపురిలోని మాగ్నస్ ఈఎన్‌టీ ఆస్పత్రిలో అత్యాధునిక కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేస్తున్నామని డాక్టర్ రవికుమార్ తెలిపారు. అంతర్జాతీయ కాంక్లియర్ ఇంప్లాంట్ దినోత్సవం సందర్భంగా మాగ్నస్ ఆస్పత్రిలో వినికిడి సమస్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పుట్టుకతో వినికిడి లోపం ఉండే పిల్లలకు రూ. 10 లక్షల ఖర్చుగల కాంక్లియర్ ఇంప్లాంట్ చికిత్స ఉచితంగా అందిస్తున్నామని, అలాగే ఆపరేషన్ అనంతరం ఉచితంగా స్పీచ్ థెరపీ సేవలు అందిస్తామన్నారు. సర్జరీ వివరాల కోసం నం.99660 00475 ద్వారా సంప్రదించవచ్చన్నారు. వైద్యులు ఎ.సత్యకిరణ్, జె.రవికుమార్ పాల్గొన్నారు.

# ఆదమరిస్తే అంతే..

### నడి రోడ్డుపై విద్యుత్ స్తంభాలు..

- తరచూ ప్రమాదాల బారిన ప్రయాణికులు
- తొలగించాలని విజ్ఞప్తి



కందుకూరులోకి వెళ్లే రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం



కందుకూరు శ్మశానవాటిక సమీపంలో రోడ్డుపై ఉన్న స్తంభం

**కందుకూరు:** రోడ్డు విస్తరణ చేసి రెండేళ్లు గడుస్తున్నా ఇంత వరకు విద్యుత్ స్తంభాలను మార్చలేదు. దీంతో రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా, సంబంధిత యంత్రాంగం మాత్రం పట్టించుకోవడం లేదు. ఇది శ్రీశైలం రహదారి నుంచి కందుకూరు గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న పరిస్థితి.

**రోడ్డుపైనే..**

కందుకూరు చౌరస్తా నుంచి కందుకూరు గ్రామం వరకు దాదాపుగా రెండు కిలోమీటర్ల మేర ఉన్న రహదారిని రెండేళ్ల క్రితం డబుల్ రోడ్డుగా విస్తరించారు. ఆ సమయంలో రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను మాత్రం తొలగించలేదు. చాలా ప్రాంతాల్లో రోడ్డుపైనే విద్యుత్ స్తంభాలు ఉండటంతో పాటు కందుకూరు గ్రామం వైపు మళ్లే ప్రాంతంలో రోడ్డు మధ్యలోనే ఉన్నాయి. దీంతో అక్కడ రహదారిని సరి అంచనా వేయలేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళలో ఆ స్తంభాలు ఉన్న చోట అదుపు తప్పి స్తంభాలను ఢీకొని ఇప్పటికే పలువురు గాయాలపాలయిన ఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. రోడ్డు మధ్యలోని స్తంభాలను తొలగించకుండా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసిన అధికారుల పనితనాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. పని చేశామా!.. చేతులు దులుపుకున్నామా! అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయాణికులు రాత్రి వేళ్లలో అదుపు తప్పి స్తంభాలను ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు.. స్థానిక ప్రజలు నడిరోడ్డుపై ఉన్న స్తంభాలను తొలగించాలని వేడుకుంటున్నారు.

### ప్రమాదాలు జరుగుతున్నాయి



రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. శ్మశాన వాటిక వద్ద రోడ్డుకు ఆనుకునే ఉన్న స్తంభంతో పాటు కందుకూరు గ్రామం చిన్న రోడ్డు వద్ద, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి.

– దేశం సత్తిరెడ్డి, కందుకూరు

### సమన్వయ లోపంతోనే



కందుకూరు చౌరస్తా నుంచి కందుకూరు వరకు రెండేళ్ల క్రితం రోడ్డును విస్తరించారు. ఆ సమయంలో విద్యుత్ స్తంభాలు మార్చడానికి ప్రతిపాదనలు చేశాం. విద్యుత్, ఆర్అండ్‌బీ అధికారుల సమన్వయ లోపంతో ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి.

– ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, కందుకూరు

# విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

ఎస్ఈ కరుణాకర్‌బాబు

**డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు తలెత్తితే ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు**

| | |
|---|---|
| సరూర్‌నగర్ | -9490153567 |
| కొత్తపేట | -9490153568 |
| ఆర్.కే.పురం | -9490153569 |
| ఎల్‌బీనగర్ | -9490153571 |
| గ్రీన్‌హిల్స్ | -7013174759 |
| బండ్లగూడ | -8333924861 |
| హయత్‌నగర్ | -9490153577 |
| ఆటోనగర్ | -9493193148 |
| శాంతినగర్ | -9490153588 |
| పెద్దఅంబర్‌పేట | -8333924864 |



మాట్లాడుతున్న ఎస్ఈపీ కరుణాకర్‌బాబు

**హుడాకాంప్లెక్స్:** వేసవి దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సరూర్‌నగర్ ఎస్ఈపీ కరుణాకర్‌బాబు సిబ్బందికి సూచించారు. మంగళవారం సరూర్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని సంబంధిత అధికారులు సమీక్ష సమావేశానికి ఆయన మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంతో పాటు అంతరాయం ఏర్పడినప్పుడు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఈ రామకృష్ణ, ఏడీఈ తిరుపతయ్య, ఏఈలు అనూషరాణి, జాన్సన్, రోహిత్‌రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

**హుడాకాంప్లెక్స్:** సరూర్‌నగర్ డివిజన్ పరిధి వెంకటేశ్వరకాలనీ కమ్యూనిటీహాల్‌లో యశోద నర్సింగ్ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో బీపీ, షుగర్, రక్త పరీక్షలు, ఈసీజీ టూడీఏకో, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు ధనంరెడ్డి మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు రంగం సంతోష్‌కుమార్, రఘు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డీ.వీ.మీనాకుమారి, సోఫియా, శ్రీధర్, కాలనీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించండి



అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

**తుక్కుగూడ :** కార్మికుల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌సీఐ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘం నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. బీఎంఎస్ 4వ మహాసభలో తీర్మానం చేసిన డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించాలన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సుధాకర్‌రావు, రాధాకృష్ణ, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్, సయ్యద్ సాబర్ హుస్సేన్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

# నేడు మహేశ్వరం ఎంపీపీ ఎన్నిక

- హైకోర్టును ఆశ్రయించిన ఎంపీటీసీ సునితానాయక్
- ఎన్నిక ఫలితాలను రెండు వారాల పాటు ప్రకటించొద్దని ఆదేశాలు
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్, బీజేపీలు




మహేశ్వరం మండల పరిషత్ కార్యాలయం

**మహేశ్వరం:** మండల పరిషత్ సమావేశం మందిరంలో బుధవారం ఉ.11 గంటలకు ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్లు మంగళవారం ఎన్నికల అధికారి సుభాషిణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ పద్మశ్రీ పేర్కొన్నారు. మండలంలో మొత్తం 13 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ఘట్టుపల్లి ఎంపీటీసీ సభ్యుడు కోరుపోలు రఘుమారెడ్డి తన ఎంపీటీసీ పదవికి రాజీనామా చేయడంతో ప్రస్తుతం 12 మంది సభ్యులు ఉన్నారు. ఎన్నికకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. ఎంపీపీ పదవి కోసం బీఆర్ఎస్ నుంచి కోళ్లపడకల్ ఎంపీటీసీ సభ్యుడు హన్మగళ్ల చంద్రయ్య, మహేశ్వరం-3 ఎంపీటీసీ సునితానాయక్, దుబ్బచర్ల ఎంపీటీసీ సువర్ణమ్మ, బీజేపీ నుంచి నాగారం ఎంపీటీసీ కుండె వెంకటేశ్ బరిలో ఉన్నారు. పదవి ఎవరిని వరిస్తుందో త్వరలో తేలనుంది. ఎంపీపీ ఎన్నికల ఫలితాలను ప్రకటించవద్దని మహేశ్వరం ఎంపీటీసీ సునితానాయక్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో బుధవారం జరిగే ఎంపీపీ ఎన్నికల ఫలితాలు రెండు వారాల వరకు ప్రకటించవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి కోర్టు ఆదేశాల ప్రకారం ఫలితాలు ప్రకటించవచ్చని తెలిపింది. ఎంపీపీ ఎన్నికను మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బీఆర్ఎస్, బీజేపీల ఎంపీటీసీ సభ్యులకు విప్ జారీ చేసినట్లు తెలుస్తుంది.

# నమూనా ఎన్నికల నిర్వహణ



ఓటు వేసేందుకు లైన్‌లో నిలుచున్న విద్యార్థులు



ఓట్లు లెక్కిస్తున్న ఉపాధ్యాయినులు

**షాద్‌నగర్ రూరల్:** మండల పరిధిలోని ఎలికట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నమూనా ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు ప్రాధాన్యం, ఎన్నికల నిర్వహణ, ప్రచారం, నాయకులను ఎన్నుకునే విధానంపై అవగాహన కల్పించారు. నమూనా ఎన్నికల్లో వార్డు సభ్యులుగా 20మంది విద్యార్థులు, ఇద్దరు సర్పంచులుగా పోటీ చేశారు. మిగిలిన విద్యార్థులతో ఓట్లు వేయించారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను విద్యార్థులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సక్కుబాయి, ఉపాధ్యాయులు శ్రీదేవి, అరుణ, జ్యోతిలక్ష్మీ, గీతమ్మ, బుగ్గమ్మ, శిరీష, మోహన్‌బాబు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఓపెన్ నాలాలతో మురుగు మరుగు



హైదరాబాద్-బీజాపూర్ రహదారి సమీపంలో చేరిన మురుగు

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు కరువు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



చిన్నమంగళారంలో మురుగు కాలువ

**మొయినాబాద్ రూరల్:** మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్మించిన ఓపెన్ మురుగు కాలువలు శిథిలావస్థకు చేరాయి. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో మురుగు చేరి ఎక్కడపడితే అక్కడ పేరుకుపోతుంది. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందడంతో దుర్వాసన వెలువడుతోంది. మండల పరిధిలోని చిన్న మంగళారం, హిమాయత్‌నగర్, కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి, తోల్‌కట్ట, జీవన్‌గూడ, ఎన్కెపల్లి, బాకారం, వీరన్నపేట్, చాకలిగూడ, అప్పారెడ్డిగూడ తదితర గ్రామాల్లో గతంలో నిర్మించిన ఓపెన్ మురుగు కాలువలు శిథిలావస్థకు చేరాయి. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి సమీపంలో శివానగర్ మురుగు కాలువ ఏరులై పారుతుంది. ఇళ్లల్లో నుంచి మురుగు చేరి కంపు కొడుతుంది. ఈ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులు, స్థానికులు ముక్కున వేలు వేసుకొని వెళ్తున్నారు. ఇక్కడ అపరిశుభ్రంగా ఉండడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారినపడుతున్నారు. ఓపెన్ మురుగు కాలువల స్థానంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరినా అంతంత మాత్రంగానే చేపట్టారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మొయినాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఓపెన్ మురుగు కాలువలను అండర్ గ్రౌండ్ డ్రైనేజీలుగా నిర్మించి అభివృద్ధికి కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

జిల్లా కాంగ్రెస్ నాయకుడు రమేశ్



దేవాలయ ప్రారంభోత్సవంలో రమేశ్

**మొయినాబాద్ రూరల్:** ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, సర్పంచుల సంఘం మాజీ కార్యదర్శి గోటికే రమేశ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం అంకెరమోని కృష్ణమ్మ ఆధ్వర్యంలో గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని ప్రారంభించారు. గ్రామస్తులతో కలిసి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గోటికే రమేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో దేవాలయాలతో ఆధ్యాత్మిక శోభ నెలకొంటుందన్నారు. కార్యక్రమాల్లో రజనీకాంత్, శంకర్‌గౌడ్, అంకరమోని శ్రీను, శంకర్, రమేశ్, ఈశ్వరమ్మ, షాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### పల్స్ పోలియోను విజయవంతం చేయండి

డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్

**చేవెళ్ల:** మార్చి 3నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్‌లోని ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 3 ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు పల్స్ పోలియో చుక్కలను వేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్‌హెల్త్ అధికారి డాక్టర్ స్వర్ణలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలను పంపిణీ చేసిన సిబ్బంది

**మహేశ్వరం:** మహేశ్వరం మోడల్ స్కూల్ విద్యార్థులకు ఎల్వీప్రసాద్ ఐ హాస్పిటల్, విజన్ భారత్ యూకే వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ధనుంజయ్ మాట్లాడుతూ.. జనవరి 30వ తేదీన విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, ఈ రోజు అద్దాలను పంపిణీ చేశారని తెలిపారు. సామాజిక సేవా దృక్పథంతో విద్యార్థుకు కంటి అద్దాలను పంపిణీ చేసిన ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జకీర్, తదితరులు పాల్గొన్నారు.

# పశువుల పెంపకంతో అదనపు ఆదాయం

**షాబాద్:** రైతులు మిశ్రమ వ్యవసాయ పద్ధతితో పాటు పాడి పశువులను పెంచి అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని డాక్టర్ సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. పాడి రైతులకు మూడు రోజుల శిక్షణలో భాగంగా క్రీడ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తిరుమలాపూర్, రేగడి దోస్వాడ, ముద్దేగూడలో నిర్వహించిన సమావేశంలో ఉచితంగా దాణా, మినరల్ మిక్సర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయంతో పాటు 1 లేదా 2 పాడి పశువులను పెంచడమనేది అనాదిగా వస్తున్న పద్ధతి అని చెప్పారు. వ్యవసాయంలో పంట నష్టం జరిగినప్పుడు, తగినంత వర్షపాతం లేకపోవడంతో తెగుళ్లు, వ్యాధుల వలన పాడైపోయినప్పుడు రైతులకు పాడి పశువుల నుంచి వచ్చే ఆదాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి పట్టణ ప్రాంతాలలో, గ్రామీణ ప్రాంతాలలో ఈ పాడి పరిశ్రమ ప్రధానమైన వృత్తిగా చేసుకుంటున్నారన్నారు. కాబట్టి పాడిపశువుల పెంపకం, పోషణ, యాజమాన్యం, పశుగ్రాసాల సాగు, వ్యాధి నివారణ, తదితర విషయాలు ముందుగా తెలిసి ఉండాలి. పాడి పశువుల యాజమాన్యం గురించి సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ రామకృష్ణా, కార్గిల్ కంపెనీ ప్రతినిధి సుమన్, వెటర్నరీ మైక్రో లాబ్స్ కంపెనీ ప్రతినిధులు శంకర్, వెంకటేశ్, పాషా, సుగుణ మాల రైతు ఉత్పత్తి దారుల సంఘం పాడి రైతులు ప్రవీణ్, సుదర్శన్, మాధవరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికబద్ధంగా చదివితేనే విజయం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కాంచన లత

**చేవెళ్ల:** విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితేనే విజయం సాధించొచ్చని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కాంచన లత పేర్కొన్నారు. మంగళవారం చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ మ్యాజిక్, బస్ ఫౌండేషన్ ఇండియాతో కలిసి ఉద్యోగ సంసిద్ధత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కావాల్సిన నైపుణ్యం, కెరీర్ ప్లానింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యా, ఉద్యోగాల విషయంలో ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఇంటర్వ్యూలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, ఫౌండేషన్ స్కిల్స్ ట్రైనర్ ఎలిషేబా, కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్, తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ రూప్న రవీంద్రన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.